క్లుప్తంగా

ఆదర్శ రైతుకు సన్మానం


రైతును సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చంద్లాపూర్ గ్రామానికి చెందిన రైతు వొర్రెల రంగయ్య ఉత్తమ ఆదర్శ రైతుగా ఎంపిక య్యారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వ ర్యంలో బుధవారం బోధన్‌లో జరిగిన ఉత్తమ ఆదర్శ రైతు సన్మాన కార్యక్రమంలో జిల్లా నుం చి రంగయ్యను ఎంపిక చేశారు. రంగయ్యను ఘనంగా సన్మానించి జ్ఞాపిక, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట లయన్స్ క్లబ్ గవర్నర్ అమర్‌నాథ్, అధ్యక్షుడు వినోద్ మోదాని, కార్యదర్శి సత్యనా రాయణ, మాజీ సర్పంచ్ రవి పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ జయంతిని విజయవంతం చేద్దాం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఈ నెల 27న కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవాలను విజ యవంతం చేద్దామని, జిల్లా వెనకబడిన తరగ తుల అభివృద్ధి శాఖ అధికారి సయ్యద్ రఫీక్ తెలిపారు. ఉదయం 10.30గంటలకు సూడా పార్క్‌లోని ఆయన విగ్రహం వద్ద కార్యక్ర మాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని పద్మశాలీలు, వివిధ కుల సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరై కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలన్నారు.

26న చాకలి ఐలమ్మ జయంతి

తెలంగాణ పోరాట యోధురాలు చాకలి ఐల మ్మ జయంతి ఉత్సవాలను ఈ నెల 26న జిల్లా కేంద్రంలోని సూడా పార్క్‌లో నిర్వహించను న్నట్లు తెలిపారు. ఉదయం 10.30గంటలకు సూడా పార్క్‌లోని విగ్రహం వద్ద కార్యక్రమా లు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రజక కులస్తులు, కులసంఘాల నాయకులు తది తరులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

పంటల సర్వే వేగవంతం చేయాలి


పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ మల్లయ్య

దౌల్తాబాద్(దుబ్బాక): మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పంటలను రైతుల వారీగా తప్పకుండా నమోదు చేయాలని ఏడీఏ కాం పాటి మల్లయ్య అన్నారు. బుధవారం తిర్మలా పూర్ గ్రామంలో వర్షాకాలంలో సాగు చేసిన పంటలను పరిశీలించి వివరాల నమోదు చేప ట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నంబర్ ప్రకారం రైతులు ఏఏ పంటలు వేశారో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ సాయి కిరణ్, ఏఈఓ సంతోష్, సునంద, రైతులు పాల్గొన్నారు.

సేవ చేయడంలోనే సంతృప్తి


పిల్లలకు దుస్తులను అందజేస్తున్న నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): అనాథ పిల్లలకు సేవ చేయడంలో సంతృప్తి ఉంటుందని మాజీ జెడ్పీ టీసీ ఎంబరి రాంచంద్రం అన్నారు. మండలం లోని అలిరాజపేట గ్రామంలో ఎస్‌సీవీ రోస్ సంస్థ ఆధ్వర్యంలో గల అనాథ పిల్లలకు పండు గను పురస్కరించుకుని తన సొంత ఖర్చులతో కొత్త దుస్తులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17 ఏళ్లుగా బతుకమ్మ, దసరా పండుగకు కొత్త దుస్తులు అందిస్తు న్నానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీచంద్రశేఖర్‌రెడ్డి, సంస్థ డైరెక్టర్ ఆగ్నెస్, కో ఆర్డినేటర్ శ్వేతారెడ్డి, సిస్టర్‌లు దీప, శాలి, రాణి, సయ్యద్ పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో నిజామాబాద్ ఎమ్మెల్యే


స్వామి వారిలో సన్నిధిలో ఎమ్మెల్యే సూర్యనారాయణ

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్నను నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారా యణ బుధవారం దర్శించుకున్నారు. ఈ సంద ర్భంగా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శేషవస్త్రాలను అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వామి వారిని దర్శిం చుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్ పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): అలాగే కొండపాక మండ లంలోని మర్పడ్గలో గల విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామిని ఎమ్మెల్యే దర్శిం చుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అన్నపూర్ణాదేవిగా అమ్మవారు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొలువుదీరిన అమ్మవారు బుధవారం విశేష అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సం దర్భంగా పలు ఆలయాలు, మండ పాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో కనిపించారు. నిత్యపూజలతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పలు మండపాల వద్ద అన్నదానం చేశారు.


నంగునూరు(సిద్దిపేట): పాలమాకులలో అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు


గజ్వేల్‌రూరల్: సంతోషిమాత దేవాలయంలో అర్ధనారీశ్వరిదేవి అలంకరణలో


వర్గల్(గజ్వేల్): వర్గల్ క్షేత్రంలో చిన్నారుల నృత్య ప్రదర్శన


చిన్నకోడూరు(సిద్దిపేట): రామునిపట్లలో మండపం వద్ద యూత్ సభ్యులు

ప్రయాణం.. నరకం

- గుంతలతో నిత్యం ప్రమాదాలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

భారీ వాహనాల రాకతో పాడైన పల్లె రోడ్లు

మర్కూక్(గజ్వేల్): గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కోట్లు ఖర్చు చేసి ఆయా గ్రామాలకు రోడ్లు నిర్మిం చింది. గ్రామ శివార్లలో వెలసిన పరిశ్రమలకు వచ్చే భారీ వాహనాలతో పల్లె రోడ్లు పాడవుతున్నాయి. ఓవర్ లోడ్లతో వాహనాలు వెళ్తుండటంతో ఎక్కడిక క్కడ గుంతలు పడి ప్రమాదకరంగా మారాయి. మండలంలోని చేబర్తి, అంగడి కిష్టాపూర్ నుండి నర్సన్నపేటకు వెళ్లే రోడ్డు, నర్సన్నపేట నుండి అలి రాజ్‌పేట రోడ్డుకు భారీ గుంతలు ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం గుంతల్లో నీరు చేరడంతో వాహనదా రులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతు న్నారు. పలు గ్రామాల ప్రజలు తమ అవసరాల కోసం ప్రధాన పట్టణాలకు వెళ్లేందుకు ఈ రోడ్డు ద్వారానే ప్రయాణం చేస్తుంటారు. పరిశ్రమలకు చెందిన భారీ వాహనాలు వెళ్లడం వల్లే రోడ్డు కుంగి పోయి గుంతలు ఏర్పడ్డాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో గుంతలు కనిపిం చక వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాల భారిన పడుతున్నారని, పరిశ్రమ యజమానులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు, వాహనదా రులు కోరుతున్నారు.


నర్సన్నపేట-అలిరాజ్‌పేట రోడ్డు పూర్తిగా గుంతలు పడటంతో వర్షాలు కురిస్తే రెండు గ్రామాల రైతులు పొలాలకు వెళ్లడానికి నానా తంటాలు పడుతున్నారు. నల్లరేగడి నేలలు కావడంతో ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లు వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తున్నాయని వాపోతున్నారు.


గుంతల మయంగా మారిన అంగడి కిష్టాపూర్- నర్సన్నపేట రోడ్డు

ఇబ్బంది పడుతున్నాం



ఈ రోడ్డు వెంబడి వెళ్లా లంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్తున్నాం. ముఖ్యం గా రాత్రి వేళల్లో గుంతలు కని పించక వాహనాలు ప్రమాదా లకు గురవుతున్నాయి. భారీ వాహనాలు రావడం వల్లే రోడ్డు పాడైయి గుంతలు ఏర్పడ్డాయి. వెంటనే సంబంధిత అధికారులు రోడ్డు మరమ్మతులు చేయాలి

\- కనకయ్య, నర్సన్నపేట

త్వరలో మరమ్మతులు



రోడ్డు ధ్వంస మైన మాట వాస్త వమే. గతంలోనే రోడ్డుకు సర్వే నిర్వ హించారు. హమ్ (హెచ్‌ఏఎం) ప్రాజెక్ట్ ద్వారా ప్రపోజల్ నిర్వహించే యోచనలో ఉంది. త్వరలోనే రోడ్డు మరమ్మతులు చేప ట్టనున్నారు.

\- ఎండీ పాషా, పీఆర్ ఏఈ

నీరు నిలిచి.. రాకపోకలకు ఇబ్బంది

చిన్నకోడూరు(సిద్దిపేట): ఇటీవల కురిసిన వర్షా లకు రోడ్లు ధ్వంసమయ్యాయి. గుంతలు పడి నీరు నిల్వడంతో వాహనదారులు ప్రమాదా లకు గురవుతున్నారు. చిన్నకోడూరు నుంచి రామునిపట్లకు వెళ్లే దారిలో రెండున్నరేళ్ల క్రితం ఒక వరుస బీటీని తొలగించి విస్తరించేందుకు మట్టి పోసి వదిలేశారు. దీంతో ఈ దారి గుండా వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.


చిన్నకోడూరు - రామునిపట్ల రోడ్డు దుస్థితి


మాట్లాడుతున్న చైర్మన్ వెంకటయ్య


వర్గల్(గజ్వేల్): పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబి రంలో రక్తపోటు, కేన్సర్, ఎనీమియా, క్షయ, గర్భి ణుల పరీక్షలు, రుతుస్రావం, శుభ్రత, పోషకా హారం, చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు ఒకే చోట నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ మల్లిఖార్జున్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ జహూరుద్దీన్, ఎంఈఓ అంజాగౌడ్, పీహెచ్‌సీ డాక్టర్ అదిభా ఖురేషి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వర్గల్ ఆస్పత్రిలో..

వర్గల్(గజ్వేల్): స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభి యాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం వర్గల్ ఆస్పత్రిలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరంలో 276 మంది ఆరోగ్య సేవలు పొందారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్ పర్యవేక్షణలో ప్రత్యేక వైద్యనిపుణులు డాక్టర్ మంజుల, ప్రణీత, జ్యోతి, జానవి, సంధ్య, నాగజ్యోతి, మహేశ్, రాకేశ్, తిరుపతిరెడ్డి వైద్యపరీక్షలు నిర్వ హించారు. ఉచితంగా మం దులు పంపిణీ చేశారు.

లోకేశ్‌కు అవార్డు ప్రదానం


లోకేశ్‌కు అవార్డును అంద జేస్తున్న మంత్రి శ్రీహరి

దుబ్బాకరూరల్: మండలంలోని గంభీర్ పూర్ గ్రామానికి చెందిన అరిగె లోకేశ్ వాట్సాప్ గ్రూపుల్లో సైనిక గ్రూప్ ఏర్పా టు చేసి 8 వేల మందికి ఉచిత కోచింగ్ ఇచ్చారు. అదేవిధంగా 175 మంది అభ్యర్థులు పలు కేంద్ర బలగాల్లో ఉద్యోగాలు సాధించారు. ఇం దుకు గాను తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డుల్లో ఆయన చోటు దక్కించుకున్నారు. ఈ అవార్డును హైదరాబాద్‌లో యువజన శాఖ క్రీడలు, మత్స్యశాఖ మంత్రి శ్రీహరి ముదిరాజ్ చేతుల మీదుగా లోకేశ్ అందుకున్నారు.

పిల్లలకు మంచి పౌష్టికాహారం ఇవ్వాలి

దుబ్బాకరూరల్: మండలంలోని చీకోడ్ గ్రామంలో అంగన్‌వాడీ ఆధ్వర్యంలో పోషణమాసం నిర్వహిం చారు. తీరొక్క రకాల పోషకాలు కలిగిన ఆహార పదార్థాలు తయారు చేశారు. ఈ సందర్భంగా అం గన్‌వాడీ టీచర్ బండ విజయ మాట్లాడుతూ గర్భి ణులు మంచి పోషకాలు కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. పుట్టబోయే బిడ్డ బలంగా పుడుతాడన్నారు. పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రు పాలు పట్టించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం లక్ష్మి, ఈఓ శిరీశ్ పాల్గొన్నారు.


తయారు చేసిన ఆహార పదార్థాలు

'దొడ్డి కొమురయ్య' వాల్ పోస్టర్ ఆవిష్కరణ


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జీవిత చరిత్రను సినిమా రూపకంగా తీసుకొస్తున్న చిత్ర నిర్మాణ కమిటీ వాల్ పోస్టర్‌ను బుధవారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య చిత్ర నిర్మాణ కమిటీ సిద్దిపేట జిల్లా చైర్మన్ సింగోజు మురళీకృష్ణ ఆచార్యులు మాట్లాడారు. సినిమా నిర్మాణంలో జిల్లా నుంచి పూర్తి సహాయ, సహకారాలందిస్తామని తెలిపారు. అనంతరం చిత్ర దర్శకులు సేనాపతి మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య జీవిత చరిత్రను సినిమా రూపం లో తెరకెక్కిస్తున్నామన్నారు. త్వరలోనే సినిమాను చిత్రీకరించి, విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పయ్యావుల ఎల్లయ్య యాదవ్, మోజెస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అపరిచితుల మాటలు నమ్మి మోసపోవద్దు

కొమురవెల్లి(సిద్దిపేట): అపరిచితుల మాటలు నమ్మి మోసపోవద్దని ఎస్‌ఐ రాజు అన్నారు. బుధ వారం కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ రాజగోపురం ఎదుట భక్తులకు మహిళల చట్టాలు, సైబర్ నేరాలు, చైన్ స్నాచింగ్, దొంగతనాలు మొద లగు వాటిపై అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామి వారి దర్శ నానికి వచ్చే భక్తులు అపరిచిత వ్యక్తులను నమ్మవద్దని హెచ్చరించారు. ఎవరైనా మహిళల పట్ల అవహేళనగా మాట్లాడినా, వేధింపులకు గురి చేస్తున్నా వెంటనే 100కు కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ షీటీమ్ పాల్గొన్నారు.

కాసులాబాద్‌లో..

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని కాసులా బాద్ గ్రామంలో మంగళవారం రాత్రి పోలీస్ కళా బృందం సభ్యులు కనువిప్పు కార్యక్రమం నిర్వహిం చారు. మూఢ నమ్మకాలు, సామాజిక రుగ్మతలు, వివిధ చట్టాలపై గ్రామస్తులకు ఆట పాటల ద్వారా అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సమత, పోలీస్ కళాబృందం సభ్యులు బాలు, రాజు, తెలంగాణ సాంస్కృతిక సారధి బృందం సభ్యులు రవి, రవీందర్, తిరుమలయ్య, క్రాంతి కుమార్, దేవదాసు పాల్గొన్నారు.


కొమురవెల్లి(సిద్దిపేట): భక్తులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

26న మెగా పేరెంట్స్ కమిటీ సమావేశం

హుస్నాబాద్: ప్రభుత్వ బాలుర జూని యర్ కళాశాలలో ఈ నెల 26న మెగా పేరెంట్స్ సమావేశం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ తెలిపారు. ఈ సమావేశంలో తల్లిదండ్రులకు విద్యా ర్థుల హాజరు, చదువు ప్రగతి, పరీక్షలలో ప్రదర్శన, భవిష్యత్ ప్రణాళికలపై పూర్తి వివరాలు వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు, అధ్యాప కులు, విద్యార్థులు ఒకే వేదికపై చర్చిం చడం ద్వారా విద్యా నాణ్యత మెరుగు పడుతుందన్నారు. విద్యార్థుల తల్లిదం డ్రులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

ఘనంగా ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, అటానమస్, ప్రభుత్వ జూనియర్ కళాశాల కో ఎడ్యుకేషన్‌లలో బుధవారం జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాలలో జరిగిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, ప్రోగ్రాం అధికారి డాక్టర్ మహేశ్ మాట్లా డారు. కాగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వ హించిన సమావేశంలో వక్తలు నందిని భగవాన్ రెడ్డి, రాధారి నాగరాజు, ప్రిన్సిపాల్ సత్యనారాయ ణరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి నగేశ్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా. శైలజ, డా. పుణ్యమ్మ, డా. మట్టా సంపత్‌కుమా ర్‌రెడ్డి, విశ్వనాథం, డా. హరిబాబు, బాలకిషన్, స్టూడెంట్ కౌన్సిలర్ ఫాతిమా, యోగా శిక్షకురాలు భారతి, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీత

సంక్షిప్త వార్తలు

◆ 23 మందికి జరిమానా

గజ్వేల్‌రూరల్: మద్యం తాగి వాహనాలు నడు పుతూ పట్టుబడిన మందుబాబులకు కోర్టు జరి మానా విధించిందని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి తెలిపారు. వివరాలు.. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సి పాలిటీ పరిధిలోని ప్రధాన చౌరస్తాల వద్ద ఇటీవల నిర్వహించిన వాహనాల తనిఖీలో 23 మంది పట్టు బడ్డారు. వీరిని బుధవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ఎదుట హాజరు పర్చగా 23 మందికి రూ. 35 వేల జరిమానా విధించారు.

◆ ఉపాధి కూలీలకు ఈకేవైసీ

గజ్వేల్‌రూరల్: గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కూలీలు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించు కోవాలని సింగాటం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ బాల్‌రాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధ వారం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం లో పనిచేసే కూలీలు పనిచేసే ప్రాంతానికి వచ్చిన సందర్భంలో, తిరిగి పని ముగించుకొని వెళ్తున్న సందర్భంలో ఎన్‌ఎంఎంఎస్ ద్వారా పని ప్రదేశం లో రెండు సార్లు వారి ముఖాన్ని యాప్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. ఇందులో భాగంగానే ఉపాధి కూలీల ఆధార్‌కార్డుకు ఈకేవైసీ చేస్తున్నట్లు తెలిపారు.

◆ చెరువుల వద్ద ఏర్పాట్ల పరిశీలన

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలో సద్దుల బతుకమ్మ పండుగ ఏర్పాట్లను బుధవారం మున్సిపల్ కమిష నర్ ఆశ్రిత్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, వైస్ చైర్మన్ కనకరాజు పరిశీలించారు. పట్టణంలోని ఆయా చెరువులు. కుంటల వద్ద ఏర్పాట్ల గూర్చి ఆరా తీశారు. బతుకమ్మ ఘాట్‌లకు రంగులు వేయాలని, సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించేందుకు పనులు ముమ్మరంగా చేప ట్టాలని సూచించారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సి లర్లు తిరుమల్ రెడ్డి, మల్లికార్జున్ రాజు పాల్గొన్నారు.

ఆడబిడ్డల అపురూప పండుగ బతుకమ్మ

నాలుగో రోజు బుధవారం బతుకమ్మ పండుగ సంబు రాలు మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాలు, పట్టణాల్లో బతుక మ్మలను అందంగా పేర్చి పాటలు పాడారు. అనంతరం సమీపంలోని చెరువుల్లో నిమ జ్జనం చేశారు. బతుకమ్మ వెం ట తీసుకెళ్లిన ప్రసాదాలను ఒక రికొకరు ఇచ్చుకుంటూ ఆప్యా యతను పంచుకున్నారు.


కొండపాక: కుకునూరుపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


సిద్దిపేట: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహిళల ఆటాపాట


ములుగు(గజ్వేల్): మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న తెలంగాణ వ్యవసాయ కమిషన్ సభ్యురాలు భవానీరెడ్డి